సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 24 । మే । 2024



అగస్త్యేశ్వరా.. నమో నమో!

వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. - 8లో



పచ్చిరొట్టతో.. పైరుకు బలం

పచ్చి రొట్ట.. భూసారం పెంపులో దిట్ట. భూముల్లో రేగడి మట్టి పోసేకంటే.. పచ్చిరొట్ట ఎరువు సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.380
రెండోరకం	రూ.220	రూ.298



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 606 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	518	518
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 137.700 కిలోలు

తడబడితే తప్పదు మూల్యం

- ముందస్తు అడ్మిషన్లతో జాగ్రత్త
- ఆకట్టుకునే ప్రచారాలు నమ్మి మోసపోవద్దు
- పాఠశాలల గురించి తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి
- రిజిస్ట్రేషన్, గుర్తింపుపై ఆరా తీయండి
- క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారా.. పరిశీలించాలి
- ఆ తర్వాతే పిల్లలను చేర్పించడం శ్రేయస్కరం



మదనపల్లె సిటీ: విద్యా సంవత్సరం మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. జిల్లాలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల తోక పేర్లతో నూతన బ్రాంచిల పేరిట ఆయా ప్రాంతాల్లో ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు హంగులూ, ఆర్భాటాలతో తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రచారాలు చేస్తూ ప్రవేశాల ప్రక్రియను చేపడుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే విద్యార్థుల చేరికలో ఆయా పాఠశాలలకు అనుమతి ఉన్నదీ లేనిదీ తెలియని పరిస్థితి ఉంది. ఈ విషయంలో తల్లిదండ్రులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. విద్యాశాఖ నియంత్రణ కొరవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఆమోదం ఉన్నట్లు నిర్దేశించుకుంటూ కొన్ని సీబీఎస్ఈ అనుమతులు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ప్రైవేటు పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ అనుమతి తీసుకోవాలి. మొదటి ఓపెనింగ్ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తి స్థాయి అనుమతి పొందాలి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాలి. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి సమ్మతించాలి.

అవగాహన ఉంటేనే..

గత విద్యా సంవత్సరం మదనపల్లెలో ఓ కార్పొరేట్ పాఠశాల తమకు సీబీఎస్ఈ అనుమతి ఉందంటూ ప్రచారాలు చేసుకుని ప్రవేశాలు కల్పించింది. ఈ విషయంపై అవగాహన లేక కొందరు తమ పిల్లలను చేర్పించారు. పుస్తకాలు తీసుకున్నారు. వేలల్లో ఫీజులు చెల్లించినా విద్యార్థులకు స్టేట్ సిలబస్ బోధనలు చేస్తున్నారంటూ తల్లిదండ్రులు ఆందోళనలు చేశారు.

▶▶ వీటిపై ఆరా తీయండి



ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపు పొంది ఉండాలి. ఇది నిబంధన. అయితే చాలా విద్యాసంస్థల బోర్డులు, ప్రకటనలు నిశితంగా పరిశీలిస్తే రిజిస్టర్ అని ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఎవరైనా చేసుకోవచ్చు. కానీ విద్యాశాఖ నుంచి గుర్తింపు తీసుకోవడం తప్పనిసరి. గుర్తింపు పొందిన విద్యా సంస్థలలోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యా సంస్థల తరఫున పరీక్షలు రాయిస్తుంటారు. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థిగానే పరిగణిస్తుంది. మరికొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు బ్రాంచీల పేరుతో పాఠశాలలను, కళాశాలలను నడుపుతూ ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచి ద్వారా పరీక్షలు రాయిస్తుంటారు. ఇలాంటి విషయాలలో తల్లిదండ్రులు కచ్చితంగా విద్యా సంస్థ అనుమతి పత్రాలను అడిగి తెలుసుకోవాలి.

▶▶ తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..



- తొలుత పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా అనేది చూసుకోవాలి.
- ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగం జారీ చేసిన పాఠశాల భవనం నాణ్యత ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి.
- మౌలిక వసతులు చూసుకోవాలి. బాత్‌రూములు, మరుగుదొడ్లు, నీటి సదుపాయాలు తప్పనిసరి. విద్యార్థులు మానసిక, శారీరకోల్లాసానికి ఉపకరించే క్రీడా ప్రాంగణం, అనుగుణంగా క్రీడా ఉపాధ్యాయులు ఉన్నారా లేదా ఆరా తీయాలి.
- అర్హత గల ఉపాధ్యాయులు బోధనలు చేస్తున్నారా లేదా పరిశీలించాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండాలి.
- సురక్షిత రవాణా సదుపాయానికి బస్సులకు రవాణాశాఖ సామర్థ్య పరీక్ష పత్రాన్ని జారీ చేస్తుంది. సుశిక్షితుడైన డ్రైవరు తప్పనిసరి.
- జీ–1 భవనాలు ఉంటే అగ్నిమాపక పరికరాలు, ఆ స్థాయి దాటితే మంటలు ఆర్పే పూర్తిస్థాయి వ్యవస్థ ఉండాలి. సంబంధిత విభాగం నుంచి అనుమతి ఉండాలి.
- ప్రభుత్వం అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థుల ను చేర్పిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి. చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని వాటిలో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట ఉన్నవారీగా పేర్కొంటున్నారు. ఫలితంగా సమస్యలు ఏర్పడతాయి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ప్రతి ప్రైవేటు విద్యా సంస్థ ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి. విద్యార్థులకు పాఠశాలల్లో క్రీడా మైదానంతో పాటు అన్ని వసతులు పక్కాగా ఉండాలి. లేకుంటే ఈ పాఠశాల గుర్తింపు రద్దు చేస్తాం. అదే విధంగా విద్యా సంస్థ పక్కాగా రిజిస్ట్రేషన్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు తప్పక పొంది ఉండాలి. ప్రైవేటు సంస్థల ఆకట్టుకునే ప్రకటనలను నమ్మి మోసపోవద్దు.

–పురుషోత్తం, డీవైఈఓ, మదనపల్లె.

రాయలసీమ అంటే అన్నమయ్య

- అన్నమయ్య కీర్తనలు వింటే వేంకటేశ్వరస్వామిని చూసినంత మహాభాగ్యం
- కీర్తనల విశ్వవ్యాప్తికి అన్నమాచార్య ప్రాజెక్టు కృషి
- విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



తాళ్లపాకలో భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న స్వరూపానందేంద్ర సరసర్వతి

రాజంపేట: రాయలసీమ అంటే అన్నమయ్య ..అన్నమయ్య అంటే రాయలసీమ అని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. గురువారం తాళ్లపాకలో భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాయలసీమలో ఎంతోమంది కవులు, జ్ఞానులు, యోగులు, సిద్ధులు జన్మించారన్నారు. తన మహిమాన్విత గానంతో శ్రీ వెంకటేశ్వరస్వామి హృదయంలో స్థానం పొందిన అన్నమయ్యకు ఎవరూ సాటిరారన్నారు. పరమపవిత్రమైన ప్రాంతం అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక అన్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా టీటీడీ అన్నమాచార్య కీర్తనలకు యావత్ భారతదేశంలోనే ప్రాచుర్యం కల్పించిందన్నారు. ప్రతి ఇంటా అన్నమయ్య కీర్తనలు ఉంటే స్వామివారిని ప్రత్యక్షంగా చూసిన అనుభూతి కలుగుతుందని చెప్పారు. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ విభీషణశర్మ మాట్లాడుతూ స్వరూపానందేంద్ర సరసర్వతి తాళ్లపాకను దర్శించడం మహాభాగ్యమన్నారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ ప్రశాంతి, అన్నమయ్య వారసులు హరినారాయణాచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు సూపరింటెండెంట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకముందు స్వరూపానందేంద్ర సరసర్వతిని ఘనంగా సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

న్యూస్‌రీల్

ముగిసిన తెప్పోత్సవాలు



తెప్పోత్సవంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : పగలంతా స్వామికి ఉపచారాలు చేసి అలిసిపోయిన అమ్మవారలు సేద తీరేందుకు మళ్లీ ఆయన చెంతకే చేరారు. స్వామి వారిద్దరినీ ఆనందింపజేసేందుకు తన కోవెల పుష్కరిణికి చేరారు. ధగధగలాడే అలంకారంతో ఉన్న తెప్పపై అల్లనల్లన విహరిస్తూ చల్లని నీటిలో ఆనంద పరవశులై సాగారు. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ తెప్పోత్సవాలలో భాగంగా మూడవరోజు గురువారం ముగింపు సందర్భంగా స్వామి, అమ్మవార్లు తెప్పపై విహరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెప్ప పై కొలువుదీర్చి మూడుమార్లు వేద పండితుల మంత్రోచ్చాటనలు, రెండుసార్లు మంగళ వాయిద్యాల సుస్వరాలు, మరో రెండుసార్లు అన్నమా చార్య కీర్తనల మధ్య తెప్పోత్సవం నిర్వహించారు.

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు సర్వే



విభిన్న ప్రతిభావంతుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న విభిన్న ప్రతిభావంతులను గుర్తించి బడి బయటి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పేందుకు డీఈఓ శివప్రకాష్‌రెడ్డి తల్లిదండ్రులకు సలహాలు అందించారు. గురువారం రాయచోటి పట్టణ పరిధిలో ఉన్న విభిన్న ప్రతిభావంతుల నమోదు కార్యక్రమాన్ని డీఈఓతో పాటు సమ్మిళిత విద్యా సమన్వయకర్త కె.జనార్దన్ పరిశీలించారు. 1 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న విభిన్న ప్రతిభావంతుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చేర్పితే వారికి ప్రభుత్వం నుంచి 21 రకాల ప్రత్యేక అవసరాలను కల్పించి వారికి సమగ్ర శిక్షణ కల్పించి ఉపకరణాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు జనార్దన్, త్రిలోక్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో టీబీ వ్యాధికి చెక్



బీసీజీ టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీపీఎంఓ రియాజ్‌బేగ్, విష్ణువర్ధన్‌రెడ్డి

రాయచోటి అర్బన్: బీసీజీ టీకాలతో దేశంలో టీబీ వ్యాధికి చెక్ పెట్టవచ్చని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారి (డీపీఎంఓ) డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని వాల్మీకివీధి యూపీహెచ్‌సీ పరిధిలో మాసాపేట రెడ్డివారిపల్లెలో నిర్వహిస్తున్న వయోజన బీసీజీ టీకా కార్యక్రమాన్ని ఆయన డీఎస్‌ఎంఓ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యలలో భాగంగా ప్రభుత్వం వయోజన బీసీజీ టీకాల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. టీబీ మరణాల తీవ్రతను నివారించడంలో ఈ టీకా చాలా సురక్షితమైందన్నారు. కార్యక్రమంలో వాల్మీకివీధి పట్టణ ఆరోగ్య కేంద్రం, వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

తిరునాలలో మెరిసిన కిరణ్ అబ్బవరం



వీరాంజనేయస్వామి మూలవిరాట్

సంబేపల్లి: మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీలో కొలువైన శ్రీ వీరాంజనేయ స్వామి తిరునాల గురువారంతో ముగిసింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ,అర్చనలు గావించారు. ఈ క్రమంలో సినీ నటుడు అబ్బవరం కిరణ్ స్వామి వారికి చాందినీ బండిని కట్టి మొక్కు తీర్చుకున్నారు. అంతేకాకుండా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో తిరునాల కొత్త శోభను సంతరించుకుంది.



చాందినీ బండిని నడుపుతున్న సినీ నటుడు కిరణ్ అబ్బవరం

వైభవంగా పౌర్ణమి కల్యాణం

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం టీటీడీ వారు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు తొడిగి తులసీ గజమాలలతో సుందరంగా అలంకరించి భక్తజనం సమక్షంలో వైభవంగా స్వామివారి కల్యాణం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.



ఒంటిమిట్ట రామయ్య పౌర్ణమి కల్యాణం దృశ్యం



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి

రాయచోటి టౌన్: ఏపీ పాలిసెట్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పాలిటెక్నికల్ కళాశాలలో ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని రాయచోటి పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ శివశంకర్ తెలిపారు. వీరికి ఈనెల 27వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్ ద్వారా డెబిట్/క్రెడిట్ కార్డు ద్వారా ఓసీ/ బీసీ విద్యార్థులు అయితే రూ.700 , ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అయితే రూ.250 చెల్లించాలని సూచించారు. ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ లోగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం appo yoe-t. nic.i n ను సంప్రదించాలని సూచించారు.

తంబళ్లపల్లెలో వైఎస్సార్‌సీపీదే గెలుపు!

- 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 59.48 శాతం ఓట్లు
- పంచాయతీ ఎన్నికల్లో 61.35 శాతం ఓట్ల ఆధిక్యం
- టీడీపీ ఓట్ల బలం 22.56 శాతానికి పడిపోయిన వైనం
- ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు నల్లేరు మీద నడకే



పెద్దతిప్పసముద్రం మండలం రంగసముద్రంలో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

బి.కొత్తకోట: అసెంబ్లీ ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విజయం నల్లేరు మీద నడకేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, ఆ తర్వాత జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సాధించిన విజయాలు, ప్రజలు అందించిన ఓట్ల బలం చూస్తే ఈనెల 13న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమ తథ్యమని తెలుస్తోంది. 2019 అసెంబ్లీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ 59.48 శాతం ఓట్లు సాధిస్తే, 2022లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 61.35 శాతం ఓట్ల ఆధిక్యం సాధించి రికార్డు సృష్టించింది. ఈ ఎన్నికల్లో టీడీపీ 2019 అసెంబ్లీ ఎన్నికలకంటే దారుణంగా ప్రజల్లో మద్దతు కోల్పోయినట్లు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీకి 61.35 శాతం ఓట్లు

2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పోటీచేయగా జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలిచారు. పోలైన ఓట్లలో ద్వారకనాథరెడ్డికి 1,05,444 ఓట్లు రాగా 46,938 ఓట్ల మెజార్టీ సాధించి 59.48 శాతం ఓట్ల వాటా దక్కించుకొన్నారు. 76 పంచాయతీల్లో ఎన్నికలు జరిగితే 63 పంచాయతీలు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కైవసం చేసుకొన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 61.35 శాతం ఓట్లు పొందింది. అంటే అసెంబ్లీ ఎన్నికల్లో దక్కిన ఓట్ల శాతంకంటే 1.87 శాతం ఎక్కువ.

▶▶ 22.56 శాతానికి పడిపోయిన టీడీపీ బలం

పంచాయతీ ఎన్నికలతోనే తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ బలమెంతో తేలిపోయింది. 76 సర్పంచు పదవులకు పోటీ జరిగితే టీడీపీ మద్దతుదారులు కురబలకోట మండలంలో 2, తంబళ్లపల్లె మండలంలో 3, పెద్దమండ్యం మండలంలో 1, పెద్దతిప్పసముద్రం మండలంలో 4 సర్పంచు పదవులను గెలిచారు. పోలైన 1,15,571 ఓట్లలో టీడీపీ మద్దతుదారులైన సర్పంచు అభ్యర్థులు, ఓడిపోయిన సర్పంచు అభ్యర్థులకు వచ్చిన మొత్తం ఓట్లు 26,083. ఇది పోలైన ఓట్లలో 22.56 శాతం. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ తరఫున కొత్త అభ్యర్థి జయచంద్రారెడ్డి పోటీ చేయడం, ఆయనకు టీడీపీ శ్రేణులు మద్దతు ఇవ్వకపోవడం, అభ్యర్థి కూడా ప్రజలను కలవకపోవడం లాంటి అంశాలు ఆయనకు ప్రతికూలంగా మారాయి. ఈ నేపథ్యంలో ఆయన ఓటమి తప్పదనే సంకేతాలు వెలువడుతున్నాయి.

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్



సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు

రాయచోటి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉన్నట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వివరించారు. గురువారం విజయవాడలోని సచివాలయం నుంచి సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్‌కిషోర్‌తో పాటు డీఆర్‌ఓ సత్యనారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. పార్లమెంటుతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాలన్నింటికీ రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ ప్రక్రియ చేపడతామన్నారు. పార్లమెంట్, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలను తీసుకొచ్చే దారిలో సీసీ కెమెరాలు, బ్యారికేడింగ్, కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించేందుకు ఏజెంట్లు అధికారులకు విడిగా బ్యారికేడింగ్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. మీడియా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ నిమిత్తం నియమించిన సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా భద్రత

కట్టుదిట్టమైన భద్రత మధ్య ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఓట్ల లెక్కింపు రోజున శాంతి భద్రతలపై జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరిధిలోని వీఆర్‌ఓలు, రాయచోటి, మదనపల్లి, రాజంపేట డీఎస్పీలు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఆర్‌ఓలు, డీఎస్పీలు సమన్వయంతో శాంతి భద్రతలను పరిరక్షించాలన్నారు. 144 సెక్షన్‌ను పటిష్టవంతంగా అమలు చేయాలన్నారు. ఎలాంటి సమస్య రానివ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున మూడంచెల భద్రతతో కూడిన అవసరమైన బారికేడింగ్, సెక్షన్ 144 అమలు తదితర అంశాలపై పూర్తి ప్రణాళికతో సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. శాంతి భద్రతల విషయంలో ఎక్కడా ఏ చిన్న పొరపాటు లేకుండా చూసుకోవాలని డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ రావు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ క్రిందపడి యువకుడు మృతి


మృతి చెందిన చందు(18)

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలి–గరుకుపల్లి రహదారిలోని సాయిబాబా ఆలయం వద్ద ట్రాక్టర్ క్రిందపడి ఓ యువకుడు మృతి చెందారు. మైలపల్లి అరుంధతి వాడకు చెందిన కేతరాసుపల్లి చందు(18) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ద్విచక్ర వాహనంలో మైలపల్లి నుంచి చిట్వేలికి వస్తూ మామిడి కాయల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ట్రాక్టర్ క్రిందపడ్డారు. తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలు

మదనపల్లె : ఆటో బోల్తా పడి ఇద్దరు మహిళలు గాయపడిన సంఘటన గురువారం పెద్దమండెం మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. మదనపల్లె మండలం చిన్నతిప్పసముద్రం గ్రామానికి చెందిన రమణమ్మ(50), శాంతమ్మ (45) రాయచోటి మండలం గొట్టివీడు గ్రామంలో జరిగే గంగ జాతరకు వెళ్లారు. ఆటోలో గురువారం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా పెద్దమండెం మండలం తురకపల్లె మలుపులో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రమణమ్మ, శాంతమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. రమణమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. పెద్దమండెం పోలీసులు కేసు విచారిస్తున్నారు.

విద్యుత్తు షాక్‌తో యువతికి గాయాలు

మదనపల్లె : విద్యుత్తు షాక్‌తో ఓ యువతి గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. నందిరెడ్డిగారిపల్లెకు చెందిన మస్తాన్ కుమార్తె షేక్ మోసిన్(16), పదో తరగతి చదివి ఇంటి వద్దే ఉంటోంది. తాగునీటి అవసరాల కోసం గురువారం మోటారు ఆన్ చేసేందుకు వెళ్లారు. ప్లగ్ పెడుతుండగా విద్యుత్తు షాక్ తగలడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటోంది.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముద్దనూరు–కొండాపురం : మండలంలోని మంగపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడని యర్రగుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజారాంరెడ్డి తెలిపారు. రైలు కింద పడిన వ్యక్తి టీ షర్టు, ధరించి వున్నాడని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పచ్చిరొట్టతో.. పైరుకు బలం

- జీలుగ, జనుము, పిల్లపెసర సాగుతో భూసారం మెండు
- జిల్లాకు 5323 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు
- గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా పంపిణీకి సిద్ధం

పచ్చి రొట్ట.. పంట దిగుబడిలో ప్రధాన భూమిక పోషిస్తుంది. భూసారం పెంపులో దిట్ట. భూముల్లో రేగడి మట్టి పోసేకంటే.. నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువు సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పచ్చి రొట్ట ఎరువుకోసం జీలుగ, పిల్లపెసర, జనుము మొక్కలను పొలంలో కలియదున్నడంతో అవి కుళ్లి మొక్కలకు సారవంతమైన భూమిని అందిస్తుంది.


జనుముపంట


జీలుగపంట


పెసరపంట

కడప అగ్రికల్చర్ : నైరుతి రుతు పవనాలు మరో వారం పది రోజుల్లో రాయలసీమను తాకనున్నాయి. ఉపరితల ద్రోణి ఆవర్తనంతో ఇప్పటికే జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. నేలలో అదును ఏర్పడితే జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 75189 హెక్టార్లలో పంటల సాగు చేస్తారని అంచనా. కేసీ కాల్వ, కుందూ, పెన్నా నదుల పరివాహక ప్రాంతాల కింద 31,171 హెక్టార్లలో వరిపంట సాగుకానుందని అధికారులు నివేదిక తయారు చేశారు. ఈ సమయంలో రైతన్నలు పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర పూత దశ రాక మునుపే భూమిలో కలియదున్నితే నిర్జీవమైన పుడమి వడి తిరిగి జీవం పోసుకుంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనం

రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్ల పెసర విత్తనాన్ని రాయితీపై అందించనుంది. జిల్లాకు 5323 క్వింటాళ్లు కేటాయించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకున్న వారికి రాయితీపై విత్తనం ఇవ్వనున్నారు. ప్రస్తుతం రసాయన ఎరువుల వాడకంతో భూమికి పోషకాలు లభించడం లేదు. ఇపుడు వాతావరణ అనుకూలతను బట్టి పచ్చిరొట్ట విత్తనం సాగు చేస్తే.. 45 రోజుల వ్యవధిలో పూత దశకు చేరుకుంటుంది. వరి నాట్లకు ముందు పంటను కలియదున్నితే కావాల్సిన పోషకాలు అందుతాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ప్రయోజనాలు మెండు..

నేలతల్లి ఒడిలో విత్తు ఆరోగ్యంగా ఎదిగి ఫలసాయం రావాలంటే భూమిలో సారం పెంచే పచ్చిరొట్ట ఎరువులు కీలక ప్రాత పోషిస్తాయి. జీలుగ, జనుము, పిల్ల పెసర సాగు చేసిన రైతులు 40 నుంచి 50 రోజుల తర్వాత దున్నుకోవాలి. భూమికి తగినంత సేంద్రియ పదార్థం అందుతుంది. లెగ్యూమ్ జాతి పచ్చిరొట్ట గాలిలోని నత్రజనిని బుడిపెల రూపంలో సేకరించి పొలంలో కలియ దున్నడంతో భూసారం పెరుగుతుంది. నేలలో తమను నిలుపుకొనే శక్తి, గాలి ప్రసరణ, నీరు ఇంకే గుణం పెంపొందుతుంది. రొట్ట కుళ్లినప్పుడు విడుదలయ్యే ఆమ్లాల ద్వారా నేల క్షారత తగ్గుతుంది. భాస్వరం ఎక్కువగా మొక్కలకు అందుబాటులోకి వస్తుంది. సూక్ష్మ ధాతువులైన ఇనుము, జింకు, మాంగనీస్ లోపాలు, అధిక ఉష్ణోగ్రత నియంత్రించవచ్చు.

జిల్లాకు మంజూరైన రాయితీ విత్తనాల వివరాలిలా...

విత్తనాలు	మంజూరైనవి (క్వింటాళ్లు)	సబ్సిడీ
జీలుగలు	4780	50 శాతం
జనుములు	463	50 శాతం
పిల్లపెసలు	80	50 శాతం

చేనుకు చేవతోపాటు అన్నదాత అధిక లాభాలు పొందవచ్చు. కృత్రిమంగా వాడుతున్న నత్రజని వినియోగం తగ్గుతుంది.

ఏ ఏ విత్తనం ఎంత లాభమంటే..

జీలుగ : ఎకరా జీలుగ సాగుకు 12 నుంచి 16 కిలోల విత్తనం అవసరం. ఈ పైరు ద్వారా 6 నుంచి 8 టన్నుల పచ్చి రొట్ట వస్తుంది. దీనిని పొలంలో దున్నడంతో నత్రజని- 30, భాస్వరం-8, పొటాషియం -25 కిలోలు పొందవచ్చు. మాగాణి భూముల్లో సాగు చేసుకుంటే మంచిది.

జనుము : ఎకరా జనుము సాగుకు 20 కిలోల విత్తనం కావాలి. పచ్చి రొట్ట 4 నుంచి 6 టన్నులు వస్తుంది. నత్రజని-40, బాస్వరం-6, పొటాషియం 20 కిలోలు వస్తుంది. పూత రాక మునుపే భూమిలో కలియదున్నాలి.

ఆర్‌బీకే ద్వారా విత్తనాలు...



పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా 50 శాతం రాయితీతో రైతులకు అందిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలోని ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ పక్రియ సాగుతుంది. పచ్చిరొట్ట విత్తనా/ కావాల్సిన ప్రతి రైతు తమ సమీపంలోని కేంద్రాలకు వెళ్లి తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలను సకాలంలో పొందవచ్చు.
– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

పిల్లిపెసర : ఎకరా పిల్లపెసర సాగుకు 6 నుంచి 8 కిలోల చల్లుకోవాలి. పంట కోత దశలో దుక్కులు చేసుకుంటే 2 నుంచి 3 టన్నుల పచ్చిరొట్ట వస్తుంది. దీని ద్వారా నత్రజని 18, భాస్వరం 2.5, పొటాషియం -13 కిలోలు వస్తుంది.

కారు కొనుగోలులో వివాదం


గాయపడిన మహబూబ్ ఖాన్

మదనపల్లె : కారు కొనుగోలు విషయంలో వివాదం తలెత్తడంతో ఓ వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని ఎస్టేట్ ప్రాంతానికి చెందిన ఇబ్రహీంఖాన్ కుమారుడు పి.మహబూబ్‌ఖాన్ మధ్యవర్తిగా ఉంటూ, ఇతరులకు ఇన్నోవా కారు విక్రయించాడు. రూ.11.5 లక్షలకు ధర కుదరగా.. రూ.8 లక్షల నగదు కొనుగోలు చేసిన వ్యక్తులు చెల్లించారు. మిగిలిన మొత్తం రూ.3.5 లక్షలు ఇస్తామని, వాహనం ధ్రువపత్రాలతో రావాలని కారు కొనుగోలు చేసిన వ్యక్తులు మహబూబ్ ఖాన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలోనే మహబూబ్‌ఖాన్ సంత గేటు సమీపంలోని అరటికాయల మండీ వద్దకు వెళ్లాడు. అక్కడ కారు ఆర్‌సీ ట్రాన్స్‌ఫర్ విషయంలో వివాదం ఏర్పడింది. ఆవేశానికి లోనైన షాజహాన్, సాదిక్, రఫీ, మరో అనుచరుడు కలిసి మహబూబ్ ఖాన్‌పై దాడి చేసి స్టూల్‌తో ఛాతీపై కొట్టారు. ఇటీవలే హార్ట్ స్ట్రోక్ కు గురైన మహబూబ్‌ఖాన్ దాడిలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు. టూటౌన్ పోలీసులు కేసు విచారిస్తున్నారు.

బీసీజీ టీకాలు వేయించాలి



కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో శైలజ


గుర్రంకొండ : బీసీజీ టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో శైలజ అన్నారు. మండలంలోని గుర్రంకొండ, తరిగొండ పీహెచ్‌సీల పరిధిలో నిర్వహించిన వయోజన బీసీజీ టీకా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీల్లో రికార్డులు పరిశీలించి పని తీరు మెరుగుపరుచు కోవాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ టీబీ(క్షయ) విముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి ప్రతి గురువారం 18ఏళ్ల వయస్సు దాటిన వారికి టీకాలు ఉచితంగా వేస్తామన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం చేయువారు, గతంలో టీబీ మందులు వాడినా తగ్గని వారు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో వేసే ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకొని టీబీ రహిత దేశంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రవీంద్రనాయక్, సులోచన, జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ చెన్నారెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సీతారామయ్య, సూపర్‌వైజర్లు మురళి, నాగిరెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, రమణనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె పట్టణంలో గురువారం జరిగింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన శ్రీనివాసులు భార్య బి.రమణమ్మ (25), కుటుంబ సమస్యలతో ఇంటి వద్ద పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స అనంతరం కోలుకుంటోంది.

ఇద్దరు ఆర్టీసీ ఉద్యోగులపై వేటు


చంద్రశేఖర్


కుమార్

పీలేరు : ఉన్నతాధికారుల ఆదేశాలు ధిక్కరించడం, బెదిరింపులకు పాల్పడడం వంటి కారణాలతో ఇద్దరు ఆర్టీసీ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు డీఎం బి.కుమార్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ పీలేరు డిపోలో డ్రైవర్లు టి.సి.శేఖర్, కుమార్ ఉన్నతాధికారులపై ఇటీవల పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేయడమేగాక, బెదిరింపులకు పాల్పడ్డారు. విచారణ జరిపిన అధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

కాకర్లవారిపల్లిలో వ్యక్తిపై దాడి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని కాకర్లవారిపల్లి వద్ద దరూర్ ప్రకాష్ నాయుడుపై ఐదుగురు వ్యక్తులు దాడి చేసినట్లు ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే ప్రకాష్ నాయుడు కాకర్లవారిపల్లి మీదుగా కారులో వెళ్తున్నారు. కనకదుర్గమ్మ జాతర సందర్భంగా కారులో ఉన్న ప్రకాష్ నాయుడు హారన్ కొట్టడంతో స్థానికులతో మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. కాకర్లవారిపల్లికి చెందిన ఐదుగురు వ్యక్తులు కలిసి ప్రకాష్ నాయుడును కొట్టడమేగాక, కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

కడప అర్బన్ : కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్, పబ్లిక్ హెల్త్ శానిటరీ ఇన్స్‌పెక్టర్‌తో కలిసి కడప పరిధిలోని 'విమ ఫుడ్ ప్రొడక్ట్స్, ఎస్.కె.ఎంటర్ ప్రైజెస్'లో తనిఖీలు నిర్వహించారు. అవసరమైన డిక్లరేషన్, తయారీ తేదీ లేకపోవడం, అపరిశుభ్ర పరిసరాలు వుండడంతో కేసులు నమోదు చేసి రూ.60 వేల జరిమానా విధించారు. ఈ తనిఖీలలో అధికారులు టి.రెడ్డెప్ప, జె.మురళీకృష్ణ, ఈ.బాలగంగాధర్ రెడ్డి, రమేష్‌రెడ్డి, సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శివమెత్తిన మాస్టార్

- అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక
- జాతీయ స్థాయి పోటీల్లో పతకాల పంట
- 45 ప్లస్ వయో విభాగంలో మూడు స్వర్ణపతకాలు

విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదునిస్తూనే.. తానూ సాధన చేశాడు.. వైఎస్‌ఆర్ కడపజిల్లా పెండ్లిమర్రి మండలం గంగనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బొగ్గేటి శివశంకర్‌రెడ్డి. ఈ నెల 22, 23వ తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన పాస్ ఇండియా 1వ ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024పోటీల్లో సత్తా చాటాడు. మూడు స్వర్ణ పతకాలు సాధించి ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు.

కడప స్పోర్ట్స్ : కమలాపురం మండలం పందిళ్లపల్లి గ్రామానికి చెందిన (ప్రస్తుతం కడప నగరం మారుతీ నగర్‌లో నివాసం) బొగ్గేటి శివశంకర్‌రెడ్డి స్వతహాగా అథ్లెటిక్స్ క్రీడాకారుడు. ఈయన జిల్లాలోని పలు పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేసి ఎందరో క్రీడాకారులను జాతీయస్థాయి విజేతలుగా తీర్చిదిద్దాడు. ప్రస్తుతం పెండ్లిమర్రి మండలం గంగనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఓవైపు విద్యార్థులకు క్రీడల్లో ఉత్తమ శిక్షణ ఇస్తూ.. తాను సైతం వారికి స్ఫూర్తినిచ్చేలా క్రీడా సాధన చేస్తున్నారు. విద్యార్థులతో పోటీపడుతూ ఆయన చేసిన కఠోర సాధన ఊరికేపోలేదు. 2022లో గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాల పంట పండించి స్టేట్ చాంపియన్‌గా నిలిచేలా చేసింది. తాజాగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 22, 23వ తేదీల్లో నిర్వహించిన 1వ ఫెడరేషన్ కప్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపిన్‌షిప్‌లో పాల్గొని పతకాల పంట పండించాడు. 45 ప్లస్ వయో గ్రూపులో పాల్గొన్న ఈయన హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటాడు. దీంతో ఈ ఏడాది ఆస్ట్రేలియాలో నిర్వహించనున్న అంతర్జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఈయనను ఎంపిక చేశారు. విజేతగా నిలిచిన బి. శివశంకర్‌రెడ్డికి టోర్నమెంట్ నిర్వాహకులు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటి పతకాల పంట పండించి, అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడంతో ప్రధానోపాధ్యాయురాలు సి.సావిత్రీదేవి, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.


అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న బి. శివశంకర్‌రెడ్డి

అగస్త్యేశ్వరా.. నమో నమో


గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరులో వైభవంగా రథోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామిల రథోత్సవం వైభవంగా జరిగింది. వేకువజామున అగస్త్యమహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీ అమ్మవారికి కుంకుమార్చన చేసి అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. నమో నమో అగస్త్యేశ్వరా.. హరహర మహాదేవ అంటూ భక్తులు జయ ధ్వనుల మధ్య రథం ముందుకు సాగింది. దారి వెంబడి చెక్క భజన, మహిళల కోలాటం, మంగళ వాయిద్యాల మధ్య స్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. ఆలయం నుంచి ప్రారంభమైన ఈ రథోత్సవం వెదుర్ల బజార్, గంగమ్మ కట్టవీధి, కొవ్వూరు గ్యారేజ్ మీదుగా మధ్యాహ్నం అమ్మవారిశాల వద్దకు చేరుకుంది. తిరిగి సాయంత్రం ప్రారంభమై మెయిన్ బజార్, పప్పుల బజార్, లైటుపాళెం మీదుగా ఆలయానికి చేరుకుంది. దారి వెంబడి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, దేవాదాయశాఖ ఏసీ శంకరబాలాజి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.


రథం లాగుతున్న భక్తజనం


మహిళల కోలాటం

పుష్పగిరిలో ఘనంగా గ్రామోత్సవం


పుష్పగిరిలో కామాక్షీ వైద్య నాథ స్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వామిలకు గ్రామోత్సవం

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో పౌర్ణమి గ్రామోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం కామాక్షీ వైద్యనాథ స్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వాములను వేర్వేరు పల్లకిపై ఆశీనులను చేసి పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీపై పుష్పగిరి మాడ వీధుల్లో గ్రామోత్సవం జరిపారు.

విత్తనశుద్ధి జాగ్రత్తగా నిర్వహించాలి


యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

గుర్రంకొండ : వేరుశనగ కాయల విత్తనశుద్ధి జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. గురువారం మండలంలోని మర్రిపాడులో విత్తనశుద్ధి కర్మాగారాన్ని ఆయన సందర్శించారు. యంత్రాల పనితీరు, ప్రాసెసింగ్ మెటీరియల్ నాణ్యతను తనిఖీ చేశారు. అక్కడే విత్తనం తేమ, షెల్లింగ్ శాతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారంలో వేరుశనగ విత్తనకాయల్ని ప్రాసెసింగ్ చేసే సమయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు ఎంతో నమ్మకంతో ఇక్కడి కర్మాగారానికి వేరుశనగ విత్తనకాయల్ని తీసుకొస్తుంటారన్నారు. జాగ్రత్తలు పాటించకపోతే విత్తనాలు పొలాల్లో చల్లినా మొలకెత్తవన్నారు. ఇందుకు సంబంధించి కర్మాగార యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించే విత్తనశుద్ధి కర్మాగార యజమానులపై చట్టపరంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా విత్తన వ్యవసాయాధికారి రమేష్‌రాజు, ఇన్‌చార్జి ఏవో నవీన్‌కుమార్‌రెడ్డి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి చెరువులో గుర్తు తెలియని మృత దేహం లభ్యమైనట్లు సికేదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. పశువులను మేపేందుకు కాపరులు చెరువు వైపు వెళ్లగా అక్కడ మృతదేహం కనిపించడంతో సమాచారం ఇవచ్చారన్నారు. చనిపోయిన వ్యక్తి వయస్సు దాదాపు 45–50 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతుడి చేతికి కడియం, నల్లటి డ్రాయర్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.